క్లుప్తంగా

నూతన సీఐల బాధ్యతల స్వీకరణ


వినోద్ కుమార్

మంగళగిరి : మంగళగిరి పట్టణ, రూరల్ నూతన సీఐలుగా బుధవారం వినోద్ కుమార్, వై శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి, తాడేపల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతి పొంది తాడేపల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ తాజాగా మంగళగిరి పట్టణానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. రూరల్ సీఐగా వై. శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. వారికి ఆయా స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముస్కాన్ ఖాతాలపై అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం ఫిరంగిపురం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ముస్కాన్ ఖాతాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకటమహేష్ మాట్లాడుతూ.. తమ బ్యాంకులో తల్లి లేదా తండ్రితో కలిసి విద్యార్థి ప్రారంభించే ఖాతాకు డెబిట్‌కార్డు, చెక్‌బుక్ వంటి సదుపాయాలు ఉంటాయని చెప్పారు. దానితోపాటు ఖాతాకు రికరింగ్ డిపాజిట్, నెల నెలా కొంత నగదు వేసుకున్నట్లయితే బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ ఖాతాను వారు ఏటా కొనసాగిస్తే ఉన్నత చదువులకు అవసరమైన రుణ సదుపాయం కల్పించడంతోపాటు తక్కువ వడ్డీ పడుతుందని చెప్పారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం దివి, కమల్‌మోహన్, ఉపాధ్యాయుడు శేషురవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు కౌలుదారు కార్డు



ఫిరంగిపురం: సాగు చేస్తూ అర్హులైన ప్రతి రైతుకు కౌలుదారుకార్డు అందజేయనున్నట్లు ఏఓ వాసంతి చెప్పారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో భూమిని సాగు చేసే ప్రతి రైతుకు కౌలు దారు కార్డు వ్యవసాయ, రెవెన్యూ శాఖల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వారికి ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు లభిస్తాయని చెప్పారు. పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే పరిహారం, ఎరువులు, పురుగుమందులు, యంత్రసామాగ్రిపై రాయితీలు వస్తాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, డీటీఓ రాజారమేష్, వ్యవసాయ విస్తరణాధికారి సుబాని, కౌలు రైతులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందర్నీ పాఠశాలలో చేర్చాలి



రేటూరు(కాకుమాను): బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని , వారితో పని చేయించటడం చట్టరీత్యా నేరమని ఎంఈఓ-2 విజయ్ భాస్కర్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేటూరు ఎస్టీ కాలనీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతి చిన్నారికి విద్యను అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.వీరాస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి పట్టణ వైకుంఠపురం ఎదురుగా ఉన్న రైల్వే అండర్ పాస్ సమీపంలోని మఠంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీటౌన్ పోలీసులు తమ సిబ్బందితో బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,300 స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

‘నీలి నాలుక’తో జీవాలకు ముప్పు

- టీకా ద్వారా వ్యాధి నివారణ
- వర్షాకాలంలో అప్రమత్తత అవసరం


గొర్రెలకు టీకాలు వేస్తున్న తాడేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ నరేంద్రరెడ్డి

తాడేపల్లి రూరల్ : వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే నీలినాలుక వ్యాధి వల్ల గొర్రెలు, మేకలకు ప్రాణహాని ఉందని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే వైరస్ వల్ల ఏటా దాదాపు 10శాతం గొర్రెలు, మేకలు, మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చాలాతక్కువ వ్యవధిలో గొర్రెలకు వ్యాపించే ఈ వైరస్ సకాలంలో నివారణ చర్యలు పాటించకపోతే వందల కొద్దీ జీవాలను పొట్టన పెట్టుకునే ప్రమాదం ఉంది. కావున ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గొర్రెల పెంపకందారులు ముందస్తు టీకాలను వేయించడంతోపాటు వ్యాధి సోకిన గొర్రెలకు సరైన చికిత్స అందిస్తూ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నీలి నాలుక వ్యాధిని కలిగించే వైరస్‌ను ఆర్బీ వైరస్ అని పిలుస్తారు. ఈ వైరస్‌లో 24 వేరియంట్లు ఉండడం వల్ల వ్యాధి నివారణ టీకాలను తయారు చేయడం కూడా కష్టంగా మారిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యూలికాయిడిస్ అనే దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి మందలోని అన్ని గొర్రెలకు చాలా తక్కువ సమయంలో వ్యాపిస్తుంది. వ్యాధికి గురైన గొర్రెలను గుర్తించి వెంటనే వాటిని మంద నుంచి వేరుచేయాల్సి ఉంటుంది. వ్యాధి బారిన పడిన పొట్టేలు వీర్యం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు....

నీలి నాలుక వ్యాధి బారిన పడిన గొర్రెల్లో తీవ్రమైన జ్వరం (104–106 డిగ్రీల వరకు) ఉంటుంది. వాటి నాలుక వాపు ఉండటమే కాకుండా లేత నీలిరంగులో కనిపిస్తుంది. పెదాలు, చిగుళ్లు, ముఖంలో కూడా వాపు వస్తుంది. ముక్కు, కన్ను నుంచి నీరు కారుతుంది. కాలి గిట్టల దగ్గర ఎర్రగా వాపు రావడంతో గొర్రెలు నడవడానికి కూడా వీలు కాక కుంటుతాయి. న్యూమోనియా లక్షణాలు ఉన్న గొర్రెల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది.

చికిత్స విధానం....

లక్షణాలు గుర్తించిన తక్షణమే దగ్గర్లోని పశువైద్యుడి సలహా మేరకు చికిత్స చేసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి బారిన పడిన గొర్రెల నోటిలో వాపు, పుండ్లు ఉండడంతో మేత మేయడానికి కూడా ఇబ్బంది పడతాయి. సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహారపదార్థాలను కొద్దిగా ఉప్పు కలిపి తాగించాలి. అందులో ఓఆర్ఎస్ లాంటి ద్రావణాలను కలిపి వ్యాధి తగ్గేవరకు ఇవ్వాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికమ్ లేదా అనాల్జిన్ వంటి మందులను వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లయితే యాంటీబయాటిక్ మందులను కూడా వాడాలి. న్యూమోనియా లక్షణాలుంటే అవిల్, సీపీఎం వంటి మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి నివారణ....

గొర్రెలు, మేకలు నీలి నాలుక వ్యాధి బారిన పడకుండా నివారించడానికి క్రమం తప్పకుండా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాలి. మూడు నెలలు పైబడిన గొర్రె పిల్లలకు 2 ఎంఎల్ చొప్పున మొదటి టీకా వేయించాలి. మళ్లీ 21 రోజులకు బూస్టర్ టీకా వేయించాలి. అక్కడ నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు, అక్టోబర్ మధ్య కాలంలో టీకాను క్రమం తప్పకుండా వేయించాలి. గొర్రెల మందను నిలిపే పాకలో దోమలు వ్యాపించకుండా తెరలు కట్టాలి. వేపాకు పొగను వేయాలి.

పెంపకం దారులు జాగ్రత్తగా ఉండాలి

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో గొర్రెల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల బారిన పడకుండా జీవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు మందలోని గొర్రెల ఆరోగ్యాన్ని కనిపెట్టుకుని ఉండాలి. నీలి నాలుక వ్యాధితో పాటు ఏ ఇతర జ్వర లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ నరేంద్రరెడ్డి
తాడేపల్లి పశువైద్యాధికారి

అవగాహనతోనే డయేరియా దూరం



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ నిర్మల్ కుమార్ తదితరులు

మంగళగిరి: అతిసార వ్యాధి నియంత్రణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు అవగాహనా ర్యాలీ చేపట్టినట్లు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. బుధవారం ఎంటీఎంసీ ఆధ్వర్యంలో అనుబంధ శాఖల అధికారులతో స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పలు నినాదాలతో సాగిన ర్యాలీ నగర ప్రజలను ఆలోచింపచేసింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా వంటి వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం చేయించుకోవాలన్నారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, డ్రైనేజీలలో పూడిక తీయడం, ఫాగింగ్, దోమలు, కీటకాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నగర ప్రజలంతా తమ చుట్టుపక్కల ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చేసుకోవడంతోపాటు పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఓఆర్ఎస్, జింక్ వినియోగంతో అతిసారను ఎదుర్కోవచ్చని ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, పట్టణ సీఐ వినోద్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ బీ శివారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, వైద్యులు, వైద్య సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేయనున్నారు. కుంకమతో అష్టోత్తర, సహస్రనామ పూజలు అర్చకులు రాజేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లి రూరల్ : డిగ్రీ చదివిన వారికి మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో జులై 28వ తేదీ నుంచి సాఫ్ట్‌వేర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వారికి అనుభవజ్ఞులతో శిక్షణ ఉంటుందని చెప్పారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం వారికి మంగళగిరి బైపాస్‌రోడ్, రత్నాల చెరువు అండర్ పాస్, వీఆర్‌కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి తాడేపల్లి పట్టణ పరిధిలోని కుంచనపల్లి డిపార్ట్ పక్కన, రామ్ స్నేహ ఎవెన్యూస్, ప్లాట్ నెం. 208 చిరునామాలో తరగతులు నిర్వహిస్తామని వివరించారు. ప్రతి శని, ఆదివారాలలో ఉదయం 11 – మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఉంటుందని, కోర్సు కాలపరిమితి 3 నెలలని వెల్లడించారు. సర్వీస్, మెటీరియల్ ఖర్చులను చెల్లించాలని, వివరాలకు 70935 29750, 99852 22857 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం పెంపునకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి

ఫిరంగిపురం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చూడాలని చెప్పారు. బోరుల పనితీరు, బావుల్లో పాచిలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీళ్ల ట్యాంకులను ప్రతి పదిహేను రోజులకోమారు శుభ్రం చేయించాలని చెప్పారు. బ్లీచింగ్‌ను బావులలో వేయించాలని, శుభ్రం చేసిన ప్రతి సారి వాటిని ఒక రిజిస్టర్‌లో నమోదు చేసి స్థానికులైన కొందరిచే సంతకాలు చేయించాలని చెప్పారు. మురుగునీటి పారుదల విషయంలో సిబ్బందితో ఎప్పటికప్పుడు పనులు చేయించాలని ఆదేశించారు. నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే చెత్త వేసేలా సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వచ్చేది వర్షాకాలం కావడంతో దోమల నియంత్రణలో భాగంగా ఆయిల్ బాల్స్‌ను కాలువల్లో, నీటి కుంటల్లో వేయాలన్నారు. సమావేశంలో ఈవో పీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నిత్య పూజలు సుదర్శన, మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం, తిరుప్పావడసేవ, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరగ్గా, భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణాలు, ఉంజల్‌సేవ తీర్థ ప్రసాద వితరణతో బ్రహ్మోత్సవాలు ముగియగా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం


తిలకిస్తున్న భక్తులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరగ్గా, ఉదయం విఘ్నేశ్వరుడికి, అయ్యప్పస్వామికి విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం శాంతి హోమం, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామికి తిరు వీధుల్లో నగరోత్సవం, మహా పుష్పాభిషేకంతో వార్షిక బ్రహోత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించగా, భారీగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

గిరిజన విద్యార్థులు చదువులో రాణించాలి

నెహ్రూనగర్: సమాజంలో గిరిజన విద్యార్థులు చదువులోని రాణించాల్సిన అవసరం ఎంతైన ఉందని మోక్షిత్ రుషిక ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మహిళా ప్రాంగణంలోని గిరిజన వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అటవీ ప్రాంతాన్ని వదిలి ఇక్కడికి వచ్చి చదువుకోవడం చాలా హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ శిరీష, హాస్టల్ వార్డెన్ శిల్ప, గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్, జిల్లా అధ్యక్షులు అంజినాయక్ పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ప్రతిభావంతులుగా ఎదగాలి


విద్యార్థులతో సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలో అంతర్గతంగా దాగిన నైపుణ్యాలను వెలికితీసి ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బండి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఎంబీఏ విభాగం నుంచి పి.అమృతవల్లి, గోపాలదాసు సుమాంజలి, వంగిపురపు యామిని ప్రియ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పర్వతనేని మేఘన చౌదరి, దండా హరనాథ్ వి.శ్రావ్య నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కళ్యాణి, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చల్లా వైష్ణవి, ఏ బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, అనిత పాల్గొన్నారు.

అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలి

లక్ష్మీపురం: అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుంచి పోస్టాఫీసు వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోదీ ప్రభుత్వానికి చెల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాన భాగస్వాములు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం రద్దు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మస్తాన్ రావు, ఏసుబాబు, రహ్మాన్, అల్లాబక్షు, ఇమ్రాన్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు గోలి సాయి, బన్నీ పాల్గొన్నారు.

మత్తుకు విద్యార్థులు బానిసలు కావొద్దు

రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు

మంగళగిరి : మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో కాంటెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలుత సరదాగా అలవాటయ్యే మాదకద్రవ్యాల వినియోగం అనంతరం వ్యసనంగా మారి భవిష్యత్తును నాశనం చేస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. అనేక మంది విద్యార్థులు అవగాహన లేక మత్తుపదార్థాలకు బానిసలుగా మారడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బీ.పాములరెడ్డి, జాతీయ సేవా పథకం ఆఫీసర్ రేఖా నరేష్, నవజీవన్ బాల భవన్ కోఆర్డినేటర్ డీ విజయరాణి, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లు ఏ కుమార్, ఎస్ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసోషియేషన్ నాయకులు

మంగళగిరి తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మోటార్ టెక్నీషియన్స్ అసోషియన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో అబ్దుల్ ఖాన్ మాట్లాడుతూ.. చేతి వృత్తులు చేసుకునే సుమారు 200 మంది ఆటోనగర్‌లో పనిచేస్తున్నామని తెలిపారు. తామంతా రిజిస్ట్రేషన్‌లకు అడ్డుపడుతున్నామని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుంటానని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు షేక్ అజీమ్, దాసరి సత్యనారాయణ, మొగల్ ఉమర్, షేక్ షమీముల్లా, రమేష్ చెరుకుపల్లి, సురేష్, జలసూత్రం సుధాకర్, షేక్ మౌలాలి, గఫార్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల అందజేత


శిక్షణ పొందిన మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో మహిళా నైపుణ్య కుట్టు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిబిరంలో తర్ఫీదు పొందిన వారికి బుధవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబీవీకే బాధ్యులు స్వరూప రాణి హాజరయ్యారు. ఐద్వా పట్టణ అధ్యక్షులు దొంతిరెడ్డి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంలో కూడా మహిళలు రాణించాలని సూచించారు. చట్టసభల్లో ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. టైలరింగ్‌లో అనేక మార్పులు, మోడల్స్ వస్తున్నాయని గుర్తుచేశారు. వాటిని అందుపుచ్చుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి పొందవచ్చని తెలిపారు. విశ్రాంత పంచాయతీ కార్యదర్శి వై. మల్లారెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణ కేంద్రం ఆర్గనైజర్ గాదె సుబ్బారెడ్డి, విశ్రాంత ఆర్‌టీసీ ఉద్యోగి దశరథరామిరెడ్డి, విశ్రాంత ఉద్యోగి రేక కోటేశ్వరరావు, నిర్వాహకులు సుజాత, బిత్రా రామారావు, సీహెచ్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

‘విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి’


సమావేశంలో పాల్గొన్న పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. కోటేశ్వరరావు తదితరులు

చేబ్రోలు : మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను విద్యార్థులు వాడితే ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతారని పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై కోటేశ్వరరావు అన్నారు. చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ కే సుచరిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐ వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో తెలియక చేసిన తప్పు జీవితాన్ని బలి తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ వల్ల క్షణికానందం పొందినా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సర్వం కోల్పోవలసి ఉంటుందన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించటానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే సుచరిత, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ కే సుధాకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

14వ రోజుకు శాంతి మహాయజ్ఞం


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ బాల స్వామీజీ పర్యవేక్షణలో లోక కల్యాణార్థం విశ్వశాంతి మరియు నవగ్రహ దోష నివారణకు తలపెట్టిన శ్రీ నవగ్రహ సహిత శ్రీ నక్షత్ర సంపూర్ణ శాంతి మహా యజ్ఞం బుధవారం 14వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా బాల స్వామీజీ పర్యవేక్షణలో ఉదయం నుంచి విశేషంగా హోమాలు నిర్వహించారు. ధనిష్ఠ నక్షత్రంలో జన్మించిన వారు పాల్గొని యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం బాల స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ వైభవం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సంపూర్ణ జీవిత చరిత్రలో ఉన్న విశేషాలపై బాల స్వామీజీ ప్రవచనం చెప్పారు. శ్రీ వాసవీ మాత ఎప్పుడు జన్మించారు.. అమ్మవారి పూర్వజన్మ వృత్తాంతం ఏమిటి..వంటి విశేషాలను తెలియజేశారు. నేటి నుంచి 30 వరకు ప్రవచన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, చుండూరు లోకనాథం, జయలక్ష్మి మాత మండలి సభ్యులు, సాలిగ్రామ మఠం సభ్యులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

రాయపూడి అనంత్‌కుమార్, S/o. లేట్. విలియ్ జోసఫ్ (లేటు), డోరు నెం. 12-90, వేములూరిపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా. షేక్ గౌస్ గారి మాకు ఖమ్మం ఆమీనాబాదా గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వే నెం. 228/c, 124 చదరాల స్థలం యొక్క డాక్యుమెంట్ నెం. 2883/2009, 06-05-2024న వేములూరిపాడు నుండి ఫిరంగిపురం వెళ్ళుచుండగా పోయినది. కావున ఎవరికైనా దొరికినచో తెలియజేయగలరు. సెల్: 74165 90550.